

మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లిలో ఎండిపోయిన వరి పొలాలను రైతులతో కలిసి పరిశీలిస్తున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి

## ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే పంటలు ఎండిపోయాయి

### రెండు తడులకు నీరందిస్తే రెండు లక్షల ఎకరాల పంట చేతికొచ్చేది

- 12 రోజులపాటు ఖమ్మం జిల్లాకు నీరు తీసుకుపోతుంటే మంత్రులు పట్టించుకోలేదు
- అదే సమయంలో చెరువులు, కుంటలు నింపితే భూగర్భ జలాలు పెరిగేవి
- క్షేత్రస్థాయిలో నివేదికలు తెప్పించి రైతులకు నష్ట పరిహారం ప్రకటించాలి
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి
- మిర్యాలగూడ మండలంలో ఎండిపోయిన పంట పొలాల పరిశీలన

మిర్యాలగూడ, మార్చి 20 : నాగార్జునసాగర్ ఎడమకాల్వ ఆయకట్టు పరిధికి కనీసం రెండు తడులు నీరందిస్తే రెండు లక్షల ఎకరాల్లో పంట చేతికొచ్చేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో బుధవారం నీళ్లు లేక ఎండిపోయిన వరి పొలాలను ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారుగా 3లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారని, కాల్వకు నీరు రాక, బోరు బావులు అడుగంటిపోయి 2 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో ఉన్న మేజర్ కాల్వల తూముల వద్ద పోలీసు బందోబస్తు పెట్టి నీరు విడుదల చేయకుండా తాగునీటి పేరుతో 12రోజులపాటు ఖమ్మం జిల్లాకు బలవంతంగా నీటిని తీసుకెళ్లారని ఆరోపించారు. అదే సమయంలో జిల్లాలో ఉన్న చెరువులు, కుంటలు నింపి నట్లయితే రైతులకు చాలా మేలు జరిగేదన్నారు. ఆ సమయంలో ఒక్క రెండు తడులు అందించినా కూడా 2 లక్షల ఎకరాల్లో పంట చేతికొచ్చేదని తెలిపారు. జిల్లాలో ఉన్న ఇద్దరు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరించి రైతుల వెన్ను విరిచారని మండిపడ్డారు. ఒక్కొక్క ఎకరాకు రూ.30వేల చొప్పున పెట్టుబడులు పెట్టారని, పంటలు చేతికొస్తే పెట్టుబడులు పోను ఒక్కో రైతుకు ఎకరాకు రూ.40వేలు లాభాలు వచ్చేవని, పంటలు ఎండిపోవడం వల్ల ఎకరాకు రూ.70వేల నష్టం వాటిల్లిందని వాపోయారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో వసూళ్లు, దందాలు తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పట్ల ప్రేమ ఉంటే ఎండిపోతున్న పంటలను కాపాడేవారని చెప్పారు. బీఆర్‌ఎస్ సర్కారులో కరువు ఉన్న పరిస్థితుల్లో నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో నీరు అతి తక్కువగా ఉన్నా కూడా రెండు పర్యాయాలు పంట పొలాలకు నీరు ఇచ్చి లక్షలాది ఎకరాలను కాపాడామన్నారు. పంటలు పండితే రైతులకు రూ.500 బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే సాకుతోనే నీళ్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. గుళ్లు, గోపురాలు తిరుగడం మంచిదేగానీ, పక్కనే ఎండిపోతున్న పంట పొలాలను మంత్రి పరిశీలిస్తే రైతుల కష్టాలు తెలిసేవని తెలిపారు. మిల్లర్లతో జిల్లా మంత్రులు కుమ్మక్కు కావడంతో రైతులకు తక్కువ ధర చెల్లిస్తూ మిల్లర్లు దోపిడికి పాల్పడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా మిల్లర్లతో మంత్రులు మాట్లాడి రైతులకు మద్దతు ధర చెల్లించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే మంత్రులను గ్రామాల్లో తిరుగనివ్వమని హెచ్చరించారు. వారి వెంట మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మోసిన్‌అలీ, నాయకులు నామిరెడ్డి యాదగిరిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మట్టపల్లి సైదులుయాదవ్, హాతీరాంనాయక్, అమరావతి సైదులు, రాములుగౌడ్, మల్లేశ్‌గౌడ్, రమణ, మజ్జిగపు సుధాకర్‌రెడ్డి, ఎండీ షోయబ్ ఉన్నారు.

## ఎండిన పొలం.. గొర్రెలకు ఆహారం



శాలిగౌరారంలో ఎండిపోయిన వరి పొలంలో గొర్రెలను మేపుతున్న కాపరులు

రోజురోజుకు ముదురుతున్న ఎండలకు వరి పొలాలు ఎండిపోతున్నాయి. భూగర్భజలాలు అడుగంటి నీళ్లందకపోవడంతో చేతికందివచ్చిన పంటలు వాడిపోతున్నాయి. ఎండిపోయిన పొలాలను చేసేదేమీ లేక పశువులు, గొర్రెలకు మేతగా వదిలేస్తున్న దుస్థితి నెలకొన్నది. శాలిగౌరారం ప్రాజెక్టు ఆయకట్టు కింద రైతు చామల దేవేందర్‌రెడ్డి తనకు ఉన్న ఎకరం పొలాన్ని ప్రాజెక్టు నీటితోనే కొన్నేండ్లుగా సాగు చేస్తున్నాడు. కాల్వ నీళ్లు అందక పంట పూర్తిగా ఎండిపోయింది. దాంతో గొర్రెలకు మేతగా ఇచ్చేశాడు. యాసంగిలో సాగు చేసిన రైతులందరి పరిస్థితి ఇలాగే ఉన్నది. –శాలిగౌరారం, 20

# కనుల పండువగా చక్రతీర్థ స్నానం

### గుట్ట విష్ణు పుష్కరిణిలో సంబురంగా వేడుక

### వైభవంగా మహా పూర్ణాహుతి, దేవతోద్వాసన, దోపు ఉత్సవం



చక్రతీర్థ స్నానానికి స్వామివారిని ఊరేగింపుగా తీసుకొస్తున్న అర్చకులు, అధికారులు

యాదగిరిగుట్ట, మార్చి 20 : పంచావతారమూర్తి యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహ స్వామి తిరు కల్యాణోత్సవం అనంతరం బుధవారం విశేష ఘట్టమైన చక్రతీర్థ స్నానాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు ప్రధానాలయంలో కల్యాణ లక్ష్మీనృసింహ స్వామిని దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠించారు. ఆలయ ప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, ఉప ప్రధానార్చకులు, పారాయణందారులు, వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఆగమశాస్త్ర రీతిలో చేపట్టారు. ఉత్సవమూర్తులను, చక్రత్ ఆళ్వార్లను మంగళవాయిద్యాలు, వేదపారాయణాలు, భక్తుల జయజయ ధ్వానాలు, కోలాట ప్రదర్శన నడుమ విష్ణుపుష్కరిణి వరకు ఊరేగించారు. పవిత్ర జలంతో లక్ష్మీసమేతుడైన యాదగిరీశుడి స్నానమాచరిస్తున్న సమయంలో యాదాద్రివాసా, యాదిరిగిరీశా, గోవిందా గోవిందా అంటూ భక్తుల నామస్మరణతో గుట్ట మార్మోగింది. శ్రీచక్రత్ ఆళ్వారుల చక్రతీర్థం అనంతరం భక్తులు పుణ్యస్నానాలను ఆచరించారు. సర్వవిధ దోశాల పరిహారార్థం చేసే విశిష్ట ప్రక్రియే చక్రతీర్థ వేడుక అని ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు తెలిపారు.

### పుష్పయాగం.. దోపు ఉత్సవం

సకల లోక పాలకుడు, అవతారమూర్తి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని వివిధ రకాల పూలతో సహస్ర నామ పారాయణాలతో శ్రీపుష్పయాగం ఘనంగా నిర్వహించారు. అతివృష్టి, అనావృష్టి లేకుండా సుభిక్షత కోసం శ్రీదేవి, భూదేవి సహితుడైన స్వామివారిని సకల పుష్పరాజములతో అర్చించారు. అనంతరం దేవతోద్వాసన, దోపు ఉత్సవాన్ని వైభవంగా జరిపించారు. బ్రహ్మోత్సవాలకు సూక్ష్మశరీరాలతో విచ్చేసి, వేడుకలను ఆద్యంతం తిలకించి ఆనందభరితులైన దేవతాగణాలను, ఋషిగణాలను, యోగీశ్వరులను ఉత్సవాంతంలో వైదికమంత్ర పూరితంగా తిరిగి వారిని స్వస్థలాలకు పంపించే వేడుకే దేవతోద్వాసన అని అర్చకులు వివరించారు.



దేవతోద్వాసనలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

### నేటితో ఉత్సవాలు పరిపూర్ణం

యాదగిరిగుట్ట వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం పరిపూర్ణం కానున్నాయి. ఉదయం 10 గంటలకు అష్టోత్తర శతఘటాభిషేకం, రాత్రి 9 గంటలకు శృంగార డోలోత్సవంతో వేడుకలకు ముగింపు పలుకనున్నారు.

### మహా పూర్ణాహుతి

బ్రహ్మోత్సవాల్లో భాగంగా యజ్ఞాచార్యులు, అర్చకులు పాంచరాత్రాగమ శాస్త్ర రీతిలో ఆలయ యాగశాలలో చతుస్థానార్చన పూజలు జరిపి వేదమంత్రాలతో మహాపూర్ణాహుతి నిర్వహించారు. బ్రహ్మోత్సవ సమయంలో ఏర్పడిన సకల దోశాలను తొలగించడానికి పరిపూర్ణుడైన పరమాత్ముడిని ప్రార్థించి, నిత్య హవిస్సులను అందించిన అగ్నిదేవుడిని ప్రసన్నం చేసుకునే మహాపూర్ణాహుతి పర్వం ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, కార్యనిర్వహణాధికారి భాస్కర్‌రావు, డీఈఓ దోర్బల భాస్కర్ శర్మ, యాజ్ఞాచార్యులు కిరణ్ కుమారాచార్యులు, ముఖ్య అర్చకులు మంగళగిరి నరసింహమూర్తి, ఉప ప్రధానార్చకులు సురేంద్రాచార్యులు, భాస్కరాచార్యులు, మాధవాచార్యులు, ఈఈలు ఊడెపు రామారావు, దయాకర్‌రెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారి గజవెల్లి రమేశ్‌బాబు, రఘు, గట్టు శ్రవణ్‌కుమార్, పర్యవేక్షకులు సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

బ్రహ్మోత్సవాల సందర్భంగా కొండపైన మాఢవీధుల్లోని ఈశాన్య ప్రాంతంలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉదయం యాదగిరిగుట్టకు చెందిన వీరపత్రాప భజన మండలి, భూదాన్‌పోచంపల్లి పాండురంగ భజన మండలి, యాదగిరిగుట్టకు చెందిన శ్రీగాయత్రి మహిళా భజనమండలి భజన కార్యక్రమాలు, భాస్కరభట్ల ఆంజనేయ శర్మవారి ఉపన్యాసం, లక్ష్మీనారాయణ భాగవతార్ హరికథ కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం నాగజ్యోతి, కౌటూరి గాయత్రి వారి భక్తి సంగీతం, కుమారి మాహ్నిత, వరంగల్‌కు చెందిన భ్రమరాంబ, జ్వాలాముఖి వారి కూచిపూడి నృత్య ప్రదర్శన, తోరణాల పద్మజ కర్ణాటక సంగీతం, కోదాడకు చెందిన రిషి డ్యాన్స్ అకాడమి వారి పేరిణి నృత్యం, ఆస్థానం వారి మంగళవాయిద్య గోష్ఠి, పిల్లుట్ల సాయిలు చిందు యక్షగానం భక్తులను అలరించాయి.

## అనాజిపురంలో ఒడిశా యువకుడి హల్‌చల్



చేతిలో కత్తితో గ్రామస్తులను బెదిరిస్తున్న ఒడిశాకు చెందిన యువకుడు

- పిల్లలను కిడ్నాప్ చేస్తున్నాడంటూ వెంబడించిన గ్రామస్తులు
- అదుపులోకి తీసుకున్న పోలీసులు

మోత్కూరు, మార్చి 20: మండలంలోని అనాజిపురంలో బుధవారం ఒడిశాకు చెందిన యువకుడు హల్‌చల్ చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన యువకుడు గ్రామంలోని జంగాల కాలనీలో అనుమానాస్పదంగా తిరుగుతూ ఓ ఇంట్లోకి చొరబడ్డాడు. ఇంట్లో ఉన్న చిన్నారిని ఎత్తు కెళ్లడానికి ప్రయత్నించాడు. గమనించిన స్థానికులు అతడిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. వారి నుంచి తప్పించుకొన్న యువకుడు చేతిలో త్రిశూలం, కత్తితో బెదిరిస్తూ.. గ్రామస్తుల పైకి రాళ్లను విసురుతూ పారిపోయేందుకు ప్రయత్నించాడు. గ్రామస్తులు యువకుడిని వెంబడించగా గ్రామ శివారులో ఉన్న జడ్పీటీసీ గోరుపల్లి శారదాసంతోష్‌రెడ్డికి చెందిన వ్యవసాయ క్షేత్రంలోని ఇంట్లోకి వెళ్లి దాచుకున్నాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి అక్కడికి చేరుకొని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఒడిశాకు చెందిన యువకుడని వలిగొండ–తొర్రూర్ జాతీయ రహదారి పనుల నిమిత్తం కూలీ పనులు చేసేందుకు కాంట్రాక్టర్ జయకృష్ణ తీసుకొచ్చాడని ఎస్‌ఐ తెలిపారు. ఈ ప్రాంతానికి కొత్త కావడంతో కుక్కలు వెంట పడ్డాయని, అతను కిడ్నాపర్ కాదని పేర్కొన్నారు.

## ఇక్కత్ పట్టు చీరెలు అద్భుతం


- నేషనల్ డిఫెన్స్ కాలేజ్ అధికారుల బృందం



భూదాన్ పోచంపల్లిలో ఇక్కత్ పట్టు చీరెలను పరిశీలిస్తున్న నేషనల్ డిఫెన్స్ కాలేజ్ అధికారుల బృందం

భూదాన్ పోచంపల్లి, మార్చి 20 : టై అండ్ డై ఇక్కత్ పట్టు చీరెలకు ప్రసిద్ధి చెందిన భూదాన్ పోచంపల్లిని నేషనల్ డిఫెన్స్ కాలేజీకి చెందిన 16 మంది అధికారులు బుధవారం సందర్శించారు. కళ పునర్వి హ్యాండ్లూమ్ యూనిట్, చేనేత సహకార సంఘం, టూరిజం పార్కును సందర్శించారు. రంగుల అద్దకం, చిటికి కట్టడం, ఆసు పోయడం, డిజైన్ వేయడం, మగ్గాలపై వస్త్రాల తయారీ, పట్టు దారం తయారీ ప్రక్రియలను స్వయంగా పరిశీలించారు. కళాత్మకంగా తయారు చేస్తున్న ఇక్కత్ పట్టు చీరెలను చూసి వారు మంత్రముగ్ధులయ్యారు. చేనేత పరిశ్రమ మీద ఆధారపడి జీవిస్తున్న కార్మికుల జీవన స్థితిగతులపై వారు అధ్యయనం చేశారు. ఈ బృందంలో టాంజానియా, నేపాల్, మయన్మార్, యూకే దేశాల చెందిన ప్రతినిధులు పాల్గొన్నారని, అధ్యయనం అనంతరం ఢిల్లీలో సమగ్ర నివేదిక అందజేస్తామని ఫ్యాకల్టీ ఇన్‌చార్జి ఏకే సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ విద్యాసాగర్, జిల్లా పరిశ్రమ శాఖ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, డీఓ ప్రసాద్, తాసీల్దార్ శ్రీకాంత్ రెడ్డి, ఆర్‌ఐ వెంకట్ రెడ్డి, కళ పునర్వి హ్యాండ్లూమ్ యూనిట్ ప్రతినిధి సాయిని భరత్, సాయిని భాస్కర్, చేనేత సహకార సంఘం మేనేజర్ రుద్ర ఆంజనేయులు పాల్గొన్నారు.

# కోమటిరెడ్డి బ్రదర్స్ టికెట్ పంచాయితీ



## భువనగిరి సీటు కోసం ఎవరికి వారే ప్రయత్నాలు

- తమ వారికంటే.. తమ వారికివ్వాలని పైరవీలు
- అన్న కొడుకు సూర్యపవన్‌రెడ్డి కోసం వెంకట్‌రెడ్డి..
- భార్య కోసం రాజగోపాల్‌రెడ్డి లాబీయింగ్
- అయోమయంలో 'భువనగిరి' కాంగ్రెస్ కేడర్
- ఫ్యామిలీ రాజకీయాలపై జనం అసహనం

**భువనగిరి కాంగ్రెస్ ఎంపీ సీటు కొత్త తలనొప్పిని తెచ్చి పెడుతున్నది. కోమటిరెడ్డి బ్రదర్స్ మధ్య అభ్యర్థి చిచ్చు పెడుతున్నది. సీటు కోసం స్వయంగా అన్నదమ్ముల మధ్య అంతర్గత వార్ నడుస్తున్నది. తమ వారి కంటే తమ వారికి ఇవ్వాలని ఎవరికి వారు లాబీయింగ్ చేసుకుంటున్నారు. దీంతో కేడర్‌లో అయోమయం నెలకొంది. కాగా కొన్ని రోజులుగా అన్నదమ్ముల మధ్య సఖ్యత లేదని ప్రచారం కూడా జరుగుతున్నది. మరోవైపు ఫ్యామిలీ పాలిటిక్స్‌పై భువనగిరి ఓటర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు.**

– యాదాద్రి భువనగిరి, మార్చి 20 (నమస్తే తెలంగాణ)

పార్లమెంట్ ఎన్నికల కోసం షెడ్యూల్ విడుదల కావడంతో రాకీయాల్లో వేడి రాజుకున్నది. ఆయా పార్టీలు అభ్యర్థులను ప్రకటిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలోని నల్లగొండ పార్లమెంట్‌కు కాంగ్రెస్ అభ్యర్థిగా కుందూరు రఘువీర్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఆ పార్టీ ఖరారు చేసింది. అయితే భువనగిరి అభ్యర్థి ఇంకా ఫైనల్ చేయలేదు. ఇప్పటికే ఉన్న నేతలతోపాటు కొత్త పేర్లు తెరపైకి వస్తున్నాయి. ఎవరికి వారు అధిష్టానం వద్ద లాబీయింగ్ చేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కూతురు కీర్తి రెడ్డి పోటీకి దరఖాస్తు చేసుకొని ప్రయత్నాలు చేస్తున్నారు.

### మంత్రి వెంకట్ రెడ్డి ఒక పేరు..

భువనగిరి సీటు తమ వారికి దక్కించుకునేందుకు కోమటిరెడ్డి బ్రదర్స్ ఎవరికి వారే వేర్వేరుగా లాబీ చేస్తున్నారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇటీవల వరకు భువనగిరి ఎంపీగా కొనసాగారు. ఎమ్మెల్యేగా గెలువడంతో ఎంపీ పదవికి రాజీనామా చేశారు. భువనగిరిలో ఆయన ప్రత్యేకంగా వర్గాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆయన రాష్ట్రమంత్రి వర్గంలో కీలకంగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో మరోసారి తన పట్టు నిలుపుకొనేందుకు తనవారికే ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఇందుకోసం తన అన్న కొడుకు అయిన సూర్యపవన్ రెడ్డికి ఇవ్వాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఇటీవల సూర్యపవన్ రెడ్డిని వెంటబెట్టుకుని సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు.

### ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మరో పేరు..

కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సోదరుడు, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సైతం తన వారి కోసం భువనగిరి ఎంపీ సీటు కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు పార్టీ మారిన రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి కావాలని అడుగుతున్నారు. ఇటీవల హోంమంత్రి పదవిపై తన మనసులోని మాట చెప్పారు. అయితే ఇప్పటికే అన్న వెంకట్ రెడ్డి మంత్రిగా కొనసాగుతున్న నేపథ్యంలో రాజగోపాల్ రెడ్డి కేబినెట్ స్థానంపై క్లారిటీ రాలేదు. గతంలో భువనగిరి ఎంపీగా పనిచేసిన రాజగోపాల్ రెడ్డికి తనకంటూ ఓ కేడర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన భార్య లక్ష్మిని భువనగిరిలో నిలుపాలని భావిస్తున్నారు. తన భార్యకు సీటు ఇవ్వాలని గట్టిగానే పట్టుబడుతున్నారు.

### కేడర్‌లో అయోమయం..

కోమటిరెడ్డి బ్రదర్స్ వేర్వేరుగా ఇద్దరి పేర్లను ప్రతిపాదిస్తుండగా, సీఎం రేవంత్ రెడ్డి చామల కిరణ్ కుమార్ రెడ్డికి అండగా నిలుస్తున్నట్లు తెలుస్తున్నది. మరోవైపు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సైతం తన కూతురుకు ఇవ్వాలని అడుగుతున్నారు. దీంతో కేడర్‌లో అయోమయం నెలకొన్నది. భువనగిరి అభ్యర్థుల ఖరారుపై ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. ఇంకోవైపు వీరిలో ఏ ఒక్కరికి సీటు ఖరారు చేసినా మిగతా ఆశావహులు సపోర్ట్ చేస్తారనే నమ్మకం లేదు. ఆయా నేతల కేడర్ సైలెంట్‌గా ఉండే అవకాశం లేకపోలేదు.

### పార్టీ అధిష్టానం నిర్ణయం తుంగలో..

కోమటిరెడ్డి ఫ్యామిలీ పాలిటిక్స్‌పై జనం అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వెంకట్ రెడ్డి మంత్రిగా, రాజగోపాల్ రెడ్డి ఎమ్మెల్యే రాజకీయాల్లో కీలకంగా ఉన్నారని, మళ్లీ కుటుంబ సభ్యులను తెరపైకి తేవడం ఏంటని ప్రజలు పెదవి విరుస్తున్నారు. కాంగ్రెస్‌లో ఒక కుటుంబంలో ఒకటే టికెట్ నినాదం తుంగలో తొక్కారని, అధిష్టానం నిర్ణయాన్నే కనీసం పాటించే పరిస్థితి లేదని విమర్శిస్తున్నారు. కాగా నేడో, రేపో టికెట్ ప్రకటించే అవకాశం ఉందని, అభ్యర్థిత్వం ఎవరికి వరిస్తుందో వేచి చూడాల్సిందే.

## రెగ్యులర్ చేయాలని ఆరోగ్య కార్యకర్తల నిరసన




భూదాన్ పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న రెండో ఆరోగ్య కార్యకర్తలు

భూదాన్ పోచంపల్లి, మార్చి 20: తమ సమస్యలు పరిష్కరించాలని, రెగ్యులర్ ఉద్యోగస్తులుగా మార్చాలని రెండో ఆరోగ్య కార్యకర్తలు డిమాండ్ చేశారు. భూదాన్ పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట బుధవారం వారు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలల నుంచి వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 17 సంవత్సరాల నుంచి ఆరోగ్యశాఖలో చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నామని తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు అందించాలని, వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని, ఎంప్లాయీస్ హెల్త్ స్కీం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు నీలమ్మ, జానకి, అనూరాధ, సునీత, రేణుక, సంధ్యారాణి, గీతా, సునీత, మహాలక్ష్మి పాల్గొన్నారు.